క్లుప్తంగా

క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు



విజేతకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: పశ్చిమగోదావరి జిల్లా భీమవరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో భీమవరం పట్టణంలోని తిరుమల కళాశాలలో శనివారం హైపర్ టెన్షన్ డే మాస ఉత్సవాలలో భాగంగా విద్యార్థులకు హైపర్ టెన్షన్ పై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కె శ్రావ్య(ప్రథమ), జి మనస్విని(ద్వితీయ) పీఎస్ గణేష్(తృతీయ) బహుమతులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జి గీతాబాయి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎన్సీడీ డాక్టర్ సీహెచ్ ధనలక్ష్మి, ఎపిడిమాలజిస్ట్ సుభాష్, తిరుమల కళాశాల డైరెక్టర్స్ సాయిరాజు, శ్రీనివాసవర్మ, సతీష్ బాబు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఆర్థిక సాయం అందజేత



భీమవరంలో దివ్యాంగులకు ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం పట్టణానికి చెందిన జిమ్ ట్రైనర్ సయ్యద్ భాషా పుట్టినరోజు సందర్భంగా శనివారం దివ్యాంగులకు ఆర్థిక సాయం అందజేశారు. తాడేరు రోడ్‌లోని ఇందిరమ్మ కాలనీకి చెందిన 8 మంది దివ్యాంగులకు సహాయం అందించిన సందర్భంగా తోట భోగయ్య మాట్లాడుతూ ప్రతి వ్యక్తి సమాజంలోని అభాగ్యులకు చేతనైనా సాయం అందజేయడం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో అల్లు శ్రీనివాస్, పెన్నాడ శ్రీను, రాకేష్, బిక్కిన శ్రీనివాస్, గొట్టుముక్కల మహేష్ రాజు, దాసరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని పద్మావతీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం జ్యేష్ఠ మాసము ఏకాదశి సందర్భంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేక పూలతో అలకరించారు. ఈ కార్యక్రమంలో వంశపారంపర్య చైర్మన్ మంతెన రామ్ కుమార్‌రాజు, కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు, ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మదన గోపాలస్వామి కల్యాణోత్సవం



వేణుగోపాల స్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: స్థానిక టెలిఫోన్ ఎక్సేంజ్ సమీపంలోని మదన గోపాలస్వామి ఆలయంలో స్వామి వారి వార్షిక కల్యాణోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రుక్మిణీ సత్యభామ సమేతస్వామి వారికి అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం స్వామివార్ల కల్యాణంను అర్చకులు సుదర్శన శేషాచార్యులు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు వీడ్కోలు

నరసాపురం రూరల్: బదిలీపై వెళ్లిన పశు సంవర్ధక శాఖ ఉద్యోగులను గురువారం స్థానిక పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో శనివారం సన్మానించారు. నరసాపురం పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ వై.సుధాకర్, మొగల్తూరు మండల పశువైద్య అధికారిణి డాక్టర్ జి.నీలిమ, కేపీపాలెం వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్‌గా బదిలీపై వచ్చిన బి.శ్రీనివాస్‌లను సిబ్బంది ఘనంగా సన్మానించారు.

విద్యా సామగ్రి పంపిణీ

యలమంచిలి: ఇలపకుర్రు పంచాయతీ కుమ్మరపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శనివారం ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి సందర్శించారు. పాఠశాలలో విద్యా రంగ పరిస్థితుల గురించి విద్యార్థుల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయుడు, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు గుత్తిందీవి శ్రీనివాసరావు సొంతంగా ఇచ్చిన విద్యా సామగ్రిని అందజేశారు.

పల్లెల్లో ఊరూరా బెల్ట్ షాపులు

- వీధికో బెల్ట్ షాపు ఏర్పాటు
- మండల పరిషత్ సమావేశంలో అధికారులను నిలదీసిన ఎంపీటీసీ
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు



గొల్లలకోడేరులో మద్యం దుకాణం పక్కనే సిట్టింగ్ ఏర్పాటు చేసిన దృశ్యం



పాలమూరు వైన్ షాపులో యథేచ్ఛగా మద్యం అమ్మకాలు



మండల పరిషత్ సమావేశంలో వీధికో బెల్ట్ షాపులు ఉన్నాయని అధికారులు నిలదీస్తున్న గరగపర్రు ఎంపీటీసీ షేక్ పాపాసాహెబ్

పాలకోడేరు: కూటమి ప్రభుత్వం అధికారం అండతో కాసుల కోసం తెలుగు తమ్ముళ్లు గమ్మత్తు దందాకు తెర తీశారు. ఎక్సైజ్ అధికారుల సహకారంతో ఊరూరా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. ఒక దుకాణానికి అనుమతులు తీసుకుని అనధికారకంగా రెండు మూడు నిర్వహిస్తూ నిరుపేదల జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం మద్యం అక్రమంగా విక్రయించినా, బెల్ట్ షాపులు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామంటూ ప్రచార ఆర్భాటం తప్ప ఆచరణ ఎక్కడా కనిపించడం లేదు. గ్రామాల్లో మద్యం ఏరులై పారుతుంది. ఉండి నియోజకవర్గంలో ఆకివీడు, ఉండి, పాలకోడేరు, కాళ్ల మండలాలు ఉన్నాయి. నియోజకవర్గంలో ఊరురా బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. లాటరీ ద్వారా మద్యం దుకాణం దక్కించుకున్న నేతలు ఆ దుకాణానికి అనుబంధంగా ఊరూరా బెల్ట్ షాపులు ఏర్పాటు చేసుకొని దండుకుంటున్నారు. క్వార్టర్ పై రూ.20 నుంచి రూ.30 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు.

● జోరుగా మద్యం దందా

ఉండి నియోజకవర్గంలో ఆకివీడు, కాళ్ల, ఉండి, పాలకోడేరు మండలాలకు 72 గ్రామాలకు గాను 28 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఒక్కో పంచాయతీకి రెండు మూడు చొప్పున 150కి పైగా బెల్ట్ షాపులు ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తెలుగు తమ్ముళ్లు మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకున్నారు. ఊరూరా ఏరులై పారిస్తూ జేబులు నింపుకుంటున్నారు. గత ప్రభుత్వంలో అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపగా ఇప్పుడు గ్రామాల్లో బెల్ట్ షాపులు ఏర్పాటయ్యాయి. మద్యం అక్రమ రవాణా కూడా జోరుగా సాగుతూ ఉండడంతో నియోజకవర్గం మరో గోవాను తలపిస్తుందని పలువురు విమర్శిస్తున్నారు.

● ఊరూరా బెల్ట్ షాపులపై ఎంపీటీసీ నిలదీత

ఇటీవల పాలకోడేరు మండల పరిషత్ సమావేశంలో ఊరురా బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి మద్యం ఏరులై పారిస్తున్నారని గరగపర్రు ఎంపీటీసీ షేక్ పాపాసాహెబ్ అధికారులను నిలదీశారు. మంచినీళ్లు దొరకడం లేదు గాని మద్యం మాత్రం 24గంటలు దొరుకుతుందని దుయ్యబట్టారు.

● దుకాణం పక్కనే నైట్ పాయింట్

మద్యం దుకాణాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే విక్రయించాల్సి ఉంది. దీనిని ఉల్లంఘించి షాపుకు అనుబంధంగా మరొక రూంలో పాయింట్‌ని ఏర్పాటు చేసుకుని రాత్రి పది గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీనికి తోడు చాలా దుకాణాల్లో ఎమ్మార్పీ ఉల్లంఘన యథేచ్ఛగా సాగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇదే అదునుగా వైన్ షాపులు వారు క్వార్టర్ బాటిల్ పై రూ.10 నుంచి రూ.20ల వరకు అధిక ధరలు వసూలు చేస్తున్నారు. బెల్ట్ షాపు పేరిట బాటిల్ మద్యంపై కొన్ని గ్రామాల్లో రూ. 20 నుంచి రూ.40 వరకు అర్ధరాత్రి దాటాక రూ.50 నుంచి 100 వరకు ఎక్కువ రేటుకి విక్రయాలు సాగిస్తున్నారు. డాబాలో నిత్యం గొడవలు జరుగుతున్నాయని, మద్యం మత్తులో యువకులు గొడవలకు పాల్పడుతున్నారు. ఇలాంటి సంఘటనలు పలుమార్లు జరిగినా వాటిని బయటకు తెలియకుండా మద్యం షాపుల యజమానులు మేనేజ్ చేస్తూన్నారని యువకుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా మద్యం షాపులు పక్కన రెస్టారెంట్‌ను తలపించే డాబాలను తొలగించాలని, బెల్ట్ షాపులపై ప్రత్యేక నిఘా పెట్టాలని మహిళలు అధికారులను కోరుతున్నారు.

24 గంటలూ సర్వీస్

నిబంధనల ప్రకారం మద్యం షాపులు పక్కన ఎలాంటి పర్మిట్ రూములు ఉండకూడదు. అయితే ప్రతి మద్యం షాపు పక్కన రెస్టారెంట్‌ను తలపించేలా పర్మిట్ రూములను నిర్వహిస్తూ 24 గంటలూ మద్యం విక్రయిస్తున్నారు. ఇందులో వచ్చే లాభంలో నెలనెలా ఎక్సైజ్ అధికారులకు ఒక షాపునకు 20వేలు చొప్పున, నాలుగు మద్యం షాపుల వారి 80వేలు మామూలు అందజేయడంతో అధికారులు సిబ్బంది మౌనం వహిస్తున్నారని విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. గంజాయి నాటు సారాపై దాడి చేశామని చెప్పుకునే అధికారులు బెల్ట్ షాపులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నాటు సారాతో పాటు బెల్ట్ షాపులపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

“ నీళ్లు దొరకడం లేదు గానీ మద్యం దొరుకుతోంది



గత ప్రభుత్వంలో అక్రమ మద్యంపై పూర్తి నిఘా ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మంచినీళ్లు దొరకడం లేదు గాని మద్యం మాత్రం దొరుకుతుంది. ప్రతి గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. దీన్ని నియంత్రించాల్సిన అధికారులు మౌనం వహించడం తగదు.

కొండేటి లాజరు కుముదవల్లి

నిబంధనలు ఉల్లంఘించడం తగదు



ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం షాపులు సమయపాలన పాటించాలి. 24 గంటలు మద్యం విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అలాగే బెల్ట్ షాపుల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయించడం వల్ల మహిళలు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇలా విచ్చలవిడిగా మద్యం దొరకడం వల్ల యువత పక్కదారి పడుతున్నారు.

వై రత్నం, మోగల్లు

బెల్ట్ షాపులపై చర్యలు తీసుకుంటాం

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇటీవలే మా దష్టికి వచ్చింది. వెంటనే చర్యలు చేపడతాం. మద్యం దుకాణం పక్కనే ఎలాంటి రూములు ఉండకూడదు ఇప్పటికే అదేశాలు జారీ చేశాం. ఎమ్మార్పీ రేట్లకే విక్రయించే విధంగా ఇప్పటికే చర్యలు చేపట్టాం.

బలరామరాజు, సిఐ, ఎక్సైజ్ శాఖ

సేవాతత్పరులకు సత్కారాలు

పెనుగొండ: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం సేవా తత్పరులకు ఘన సత్కారం నిర్వహించారు. శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో భక్తులకు రెండు బెంచీలను బహుకరించారు. సంఘ సభ్యులు నూలి త్రినాద్ అన్నపూర్ణ దంపతుల సహకారంతో వాసవీ శాంతి ధాం గోశాలలో గరుకు స్తంభం ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా దేశానికి సేవలందించిన జవాన్ సుంకర నాగేశ్వరరావు, యోగా గురువు రాఘవ రెడ్డి, ఆశా వర్కర్ అవలీలలకు ఘన సత్కారం చేశారు. కార్యక్రమంలో నూలి త్రినాథ్, గోకవరపు శ్రీనివాసరావు, నాగబాబు, పవన్ పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ బడుల్లో చదివించాలి

పెనుమంట్ర: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించి తమ ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచుకోవాలని ఎంపీటీసీ తమనంపూడి నాగ సత్యనారాయణరెడ్డి అన్నారు. నత్తా రామేశ్వరం గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం అందించే సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో యు.నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ మల్లిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, కర్రి కలికిరెడ్డి, పూర్వ విద్యార్థులు కర్రి అచ్చిరెడ్డి, తమనంపూడి దుర్గారెడ్డి, కర్రి సూర్యనారాయణరెడ్డి, వెలగల నాగు, ప్రధాన ఉపాధ్యాయిని ఎస్.నాగమణి, తులసీ పాల్గొన్నారు.

కొత్త ఉత్సాహంతో వైఎస్సార్ సీపీ శ్రేణులు



భీమవరంలో సమావేశానికి ఊరేగింపుగా వస్తున్న వైఎస్సార్ సీపీ సమన్వకర్త చినమిల్లి వెంకటరాయుడు



భీమవరంలో ప్రసాదరాజు, వెంకటరాయుడులను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

- సమన్వయ సమావేశానికి పెద్ద సంఖ్యలో హాజరు
- భారీ ఊరేగింపుతో ఎన్నికల ప్రచారాన్ని గుర్తు చేసిన శ్రేణులు
- చినమిల్లికి అభినందనల వెల్లువ

భీమవరం: భీమవరం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమన్వయ సమావేశంతో పార్టీశ్రేణుల్లో కొత్త ఉత్సాహం ఉరకలెత్తింది. నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితుడైన చినమిల్లి వెంకటరాయుడు అధ్యక్షతన శనివారం భీమవరం పట్టణం నర్సయ్యఅగ్రహారం కుముదవల్లి రోడ్డులోని ప్రైవేట్ ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమన్వయ సమావేశం, చినమిల్లి అభినందన సభకు జిల్లాలోని పార్టీ నాయకులతో పాటు నియోజకవర్గంలోని భీమవరం పట్టణం, వీరవాసరం, భీమవరం రూరల్ మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ సీపీ అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో విసుగుచెందిన ఉన్న పార్టీ శ్రేణులు, ప్రజలు సమావేశంలో నాయకుల ప్రసంగాలకు కరతరాళధ్వనులతో మద్దతు పలికారు. వెంకటరాయుడు స్వగ్రామమైన భీమవరం మండలం రాయలం గ్రామం నుంచి భారీ ఊరేగింపుగా రావడంతో ఆయనకు దారిపొడవునా దాదాపు నాలుగు కిలోమీటర్లు పెద్ద సంఖ్యలో ప్రజలు అభివాదం చేస్తుంటే ఎన్నికల ప్రచారాన్ని తలపించిందనే వ్యాఖ్యలు వినిపించాయి. సమావేశానికి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరుకావడంతో పార్టీ నాయకుల్లో మరింత జోష్ నింపింది. ఎన్నికల్లో ఎప్పుడు వచ్చినా మేం సిద్ధమనే సంకేతాన్ని ఇచ్చినట్లు సమావేశానికి హాజరైన నాయకులు ఆనందం వ్యక్తం చేశారు.

● వెంకటరాయుడుకు అభినందనలు వెల్లువ

సమావేశం అనంతరం భీమవరం నియోజకవర్గ సమన్వకర్త చినమిల్లి వెంకటరాయుడును పార్టీ శ్రేణులు అభినందనలతో ముంచెత్తారు. నియోజకవర్గ పార్టీ క్యాడరేగాకుండా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు రాయుడ్ని గజమాలలు, పుష్పగుచ్చాలు అందజేసి దుశ్సాలువాతో ఘనంగా సత్కరించారు.

రాజన్న సేవాసమితి సేవలు అభినందనీయం



అర్తమూరులో మొబైల్ వాటర్ ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఉండి: మండలంలో రాజన్న సేవాసమితి సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. అర్తమూరులో సేవాసమితి ఆధ్వర్యంలో నూతనంగా మొబైల్ వాటర్ ట్యాంకర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సేవాసమితి చైర్మన్ రాజన్న మాట్లాడుతూ మన రాష్ట్రంతో పాటు తెలంగాణాలో కూడా సేవాసమితి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్తిస్థాయిలో సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు గాను కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కమిటీ ద్వారా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోని సమస్యలను గుర్తించి వారికి అవసరమైన సహాయాన్ని అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. మండలంలో తాగునీటి సమస్య అధికంగా ఉన్న కారణంగా ముందుగా మొబైల్ వాటర్ ట్యాంకర్‌ను సిద్ధం చేశామన్నారు. అంబేద్కర్ రాజన్న సేవాసమితి కమిటీ చైర్మన్‌గా బూరగ ఏసుబాబు(రాజన్న), ఉపాధ్యక్షుడిగా బీ జయరాజు, కార్యదర్శిగా పరమేష్, సలహాదారులుగా అర్తమూరు సర్పంచ్ యేసు, చెరుకువాడ సర్పంచ్ కొండవేటి సాంబశివరావు, ఎంపీటీసీ చిగురుపాటి కృష్టాఫర్, మాజీ ఎంపీటీసీ గూట్ల వెంకటేశ్వరరావు, సభ్యులుగా వార్డు సభ్యురాలు ఎం.కుమారి, ఆర్ ఇశ్రాయేలు, కే ఇశ్రాయేలు,పోతుల సుందరరావు,మాజీ సర్పంచ్ జీ వెంకటేశ్వరరావు,పీ బాలు పాల్గొన్నారు.

పట్టణంలో కుక్కల బెడద

నరసాపురం: పట్టణంలో వీధి కుక్కల బెడద విపరీతంగా పెరిగిపోయింది. పట్టణంలో 31 వార్డులు ఉన్నాయి. అన్ని వార్డుల్లోను వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఇక మార్కెట్ ప్రాంతంలో అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇరవై, ముప్పై కుక్కలు గుంపుగా తిరుతున్నాయి. పంజాసెంటర్, జ్యూయలరీ మార్కెట్ ప్రాంతాల్లో గుంపుగా తిరుగుతూ జనాన్ని తరుముతుండటంతో భయాందోళనలు చెందుతున్నారు.

ముందస్తు జాగ్రత్తలతో వ్యాధులు దూరం



మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా ఆరోగ్యం ఉండవచ్చని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం భీమవరం కలెక్టరేట్ గ్రౌండ్ నందు నిర్వహించిన 11వ యోగా దినోత్సవం కార్యక్రమం అనంతరం ప్రతి నెల 3వ శనివారం నిర్వహించే స్వచ్ఛంధ్ర, -స్వర్ణాంధ్రలో భాగంగా నిర్వహించే కార్యక్రమాన్ని ఈ వారం యోగా డే సందర్భంగా జిల్లా అటవీ శాఖ భీమవరం వారి ఆధ్వర్యంలో ‘హరిత యోగా’ కార్యక్రమం చేపట్టి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ చేతుల మీదుగా మొక్కలను పంపిణీ చేశారు. యోగా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థిని, విద్యార్థులకు ప్రజలకు 9,632 మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా అటవీ శాఖ అధికారి డి.ఆశా కిరణ్, పరిపాలన అధికారి యం.భారతి, సీనియర్ అసిస్టెంట్ సి.హెచ్.విజయ కుమార్, బి.పోశమ్మ, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ యస్.సురేష్ కుమార్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె.రామ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపు చేయకుంటే ఇబ్బందులే



భీమవరం ఆర్ఆర్‌డీఎస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

భీమవరం: నీటిని పొదుపు చేయకపోతే భావి తరాలకు ఇబ్బందులు తప్పవని పలువురు వక్తలు పేర్కొన్నారు. భీమవరం ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ‘నీరు మీర్చు’ అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ వికేజే ప్రసూన, జాన్సీల క్ష్మీబాయి మునిసిపల్ గరల్స్ హైస్కూల్ హెచ్‌ఎం కె కృష్ణకుమారిలు మాట్లాడుతూ నీటి వృథాను అరికట్టి, నీటి వనరులను సంరక్షించుకోకపోతే ప్రజలు ఆకలి దప్పులతో అలమటించాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి సురక్షిత జలాలను అందజేయాలన్నారు. ముందుగా కళాశాలలో యోగాంధ్ర కార్యక్రమంలో విద్యార్థులతో యోగాసనాలు అభ్యాసం చేయించారు. అనంతరం నీటిని పొదుపుగా వాడుతామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పి అరవిందస్వామి, కాకుమాని శ్రీనివాసరావు, ఎస్ లక్ష్మీకాంతం, జి ఉమామహేశ్వరి, ఎల్.నర్సింహారావు, డీవీవీ సత్యనారాయణ, ఇ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విష్ణు కళాశాలలో ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్



విష్ణు కళాశాలలో ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో పాల్గొన్న అధ్యాపకులు

భీమవరం: భీమవరంలోని డాక్టర్ బీవీరాజు ఫౌండేషన్ విష్ణు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం, కాకినాడ జెఎన్‌టియుకె చెందిన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం సంయుక్తంగా ఆధ్వర్యంలో 5రోజుల పాటు ‘సస్టైనబుల్ డ్రైవ్స్ రెన్యూవబుల్ ఎనర్జీ సోల్యూషన్స్ ఫర్ ఎలక్ట్రిక్ వెహికల్ సిస్టమ్స్’ అనే అంశంపై నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మంగం వేణు మాట్లాడుతూ దీనిద్వారా అధ్యాపకులు, పరిశోధకులకు సమగ్ర అవగాహనను కలిగించడమేగాక అభ్యాసం, పరిశ్రమ అనుభవాల సమన్వయంతో ప్రామాణికమైన శిక్షణ లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యేముల ప్రదీప్ కుమార్ (ఐఐటీ, హైదరాబాద్), ఉద్దంటి సందీప్ (ఎన్ఐటీ ఆంధ్రప్రదేశ్), టి వినయ్ కుమార్, తేజవతు రమేష్, సింగిరికొండ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్ ఎం శ్రీలక్ష్మి, ఆర్‌విడి రామారావు తదితరులు పాల్గొన్నారు.

హిందూ శ్మశాన వాటిక ప్రారంభం



ప్రారంభోత్సవంలో పాల్గొన్న గ్రామ పెద్దలు

కాళ్ల: మండల కేంద్రమైన కాళ్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన స్వర్గధామం (హిందూ శ్మశాన వాటిక) ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం నిర్వహించారు. గ్రామ యువత ఆధ్వర్యంలో గ్రామస్తులు, దాతల సహకారంతో సుమారు రూ. 30 లక్షలతో నిర్మించిన స్వర్గధామంలో దహన సంస్కారాలకు ప్రత్యేకంగా నిర్మించిన భవనంతో పాటు, వెయిటింగ్ హాల్ అదేవిధంగా స్వర్గధామం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ శివుని విగ్రహం చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమంలో కోటి పాండురంగారావు, తోట కృష్ణ పుప్పాల బుజ్జి, బడేటి నరసింహమూర్తి, వానపల్లి శ్రీనివాసరావు, పాపోలు శేషు, గంజాల శ్రీనివాసు, ఆరేటి దిలీప్ కుమార్, గనిశెట్టి సత్యనారాయణ, నిమ్మల పండు, జీవి నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉత్సాహంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



భీమవరం డీఎన్నార్ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న దృశ్యం



స్థానిక ఏఎంసీలో ధ్యానం చేస్తున్న దృశ్యం

భీమవరం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం భీమవరం పట్టణంలోని పలు విద్యాసంస్థలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. యోగాసనాలు వేయడంలో మెలకువులు, వాటి వల్ల ప్రయోజనాలు యోగాగురువులు వివరించారు. యోగాతో మానసిక ప్రశాంతత, శరీరక ఆరోగ్యానికి ఎంతగానో దోహదం చేస్తుందని చెప్పారు. పట్టణంలో ఆదిత్య స్కూల్లో నిర్వహించిన యోగా కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఆదిత్య కృష్ణంరాజు, ప్రిన్సిపల్ టి శ్రీనివాస్ నేతృత్వంలో యోగాసనాలు వేశారు. డీఎన్నార్ కళాశాలలో ఇండోర్‌స్టేడియంలో నిర్వహించిన యోగా డే కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కర్సపాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు), ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు పాల్గొన్నారు. ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ జిల్లా యోగా కోఆర్డినేటర్ వై వంశీకృష్ణ యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, పీఏఐఈ కోఆర్డినేటర్ పి భవాని తదితరులు పాల్గొన్నారు. అలాగే భీమవరం మండలంలోని వీరవాసరం, భీమవరం అర్బన్ తదితర ప్రాంతాల్లో అంతర్జాతీయ యోగాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ధ్యానం అంటే పరధ్యానం లేకుండా ఉండటమే

ఆకివీడు: యోగా ప్రతి వ్యక్తీ నిత్యకృత్యంలో ఒకటి కావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. స్థానిక ఏఎంసీ, జెడ్పీ స్కూళ్లు, కాలేజీలు, పతంజలి యోగారోగ్య కేంద్రం తదితర ప్రాంతాల్లో ప్రపంచ యోగా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ధ్యానం అంటే పరధ్యానం లేకుండా జీవించడమేనన్నారు. దేహానికి శక్తి తరంగాల్ని తీసుకుని శరీరాన్నంతటినీ కాంతి వంతంగా మారుస్తుందన్నారు. యోగాసనాల వల్ల అష్ట సిద్ధుల్లోని కొన్ని శక్తులు లభిస్తాయని మన పూర్వీకులు ఆనాడే చెప్పారన్నారు. మానసిక ప్రశాంతత, శరీర అవయావాల పుష్టి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో స్పిర్చువల్ సొసైటీ జిల్లా కార్యదర్శి డాక్టర్ పీబీ.ప్రతాప్‌కుమార్, యోగాసనాచార్యులు ఉండ్రమట్ల సాంబశివరావు, కందుల సత్యనారాయణ, మోటుపల్లి సతీష్, ముదునూరి శ్రీహరిరాజు, నెల్లి సతీష్, సత్యనారాయణ, కమిశెట్టి ప్రసాద్, మోటుపల్లి సాయి, పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు, మహిళలు, స్థానికులు వేలాదిగా యోగాసనాలు చేశారు. ఉండి నియోజకవర్గంలో కాళ్ల, ఉండి, పాలకోడేరు మండలాల్లో అంతర్జాతీయ యోగాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.